www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం 29.01.2025


4లో

# రైతు భరోసా నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వ ప్రయత్నం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

# రాష్ట్రంలో టూరిజం కొత్త పాలసీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- ఎకో టూరిజానికి ప్రోత్సాహం
- గత పాలనలో టూరిజం మరుగునపడింది
- తెలంగాణలో ప్రపంచంలోనే అద్భుతమైన ఆలయాలు, పర్యటక ప్రాంతాలు

**కలంజ్యోతి, రంగారెడ్డి :**

రాష్ట్రంలో కొత్త టూరిజం పాలసీ తీసుకువస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందులో ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఎకో టూరిజంపై అసెంబ్లీలో కూడా చర్చించామని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్పీరియమ్ పార్క్ ను ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో టెంపుల్, ఎకో టూరిజం వెనకబడుతుందనీ అందుకే టూరిజం పాలసీ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. టెంపుల్, ఎకో టూరిజంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణలో రామప్ప, వేయిస్తంభాల గుడి లాంటి ప్రపంచ ప్రఖ్యాత మందిరాలు, అద్భుతమైన దేవాలయాలు ఉన్నాయని




మిగతా 2లో


2లో

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

3లో




# ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలి

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్

2లో

# కొత్తకొండ హుండీల లెక్కింపు

జాతర ఆదాయం రూ. 1.10కోట్లు



2లో



# కొత్తకొండ జాతర హుండీల లెక్కింపు

*జాతర ఆదాయం రూ. 1.10కోట్లు*

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర ఆదాయం రూ. 1కోటి 10లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో కిషన్ రావు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు కొత్తకొండ జాతర కన్నుల పండువగా జరిగింది. హుండీ ఆదాయం రూ. 36,27,222, విదేశీ కరెన్సీ 44, ఎనిమిది గ్రాముల మిశ్రమ బంగారం, 1కిలో 900 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్టు తెలిపారు. జాతరలో టెండర్ల ద్వారా రూ. 43,38,000 కలిపి మొత్తంగా 1కోటి 10లక్షల 36వేల 563 వచ్చినట్లు పేర్కొన్నారు. గత ఏడాదికంటే రూ. 15 లక్షల97వేల58 అదనపు ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్ ఫెక్టర్ అనిల్, సరస్వతి సేవా సమితి, వెంకటేశ్వర సేవా సమితి, గోమాత సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కొండగట్టులో భక్తుల సందడి

**కలంజ్యోతి, మల్యాల :** ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈవో కృష్ణ ప్రసాద్ అధ్వర్యంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరినాథ్ భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

**కలంజ్యోతి, నిర్మల్ :** విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్ లో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు భయం వీడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరీక్షలకు రాబోయే రెండు నెలలు కీలకమని, సమయం వృథా చేయకుండా మీ కలలను నిజం చేసుకోవడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే సిలబస్ పూర్తయినందున ప్రత్యేక తరగతులకు వందశాతం విద్యార్థులు హాజరు కావాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులు నివృత్తి చేయాలని సూచించారు. గత సంవత్సర 10వ తరగతి ప్రశ్నాపత్రాలను పరిశీలించి ప్రశ్నలకు జవాబులు రాయడం, చదవడం చేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అండగా ఉంటారని, చదువులో క్రమశిక్షణను పాటిస్తూ నిబద్ధతతో లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా యంత్రాంగం ప్రోత్సాహకాలను అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో టూరిజం కొత్త పాలసీ

▸▸ మొదటిపేజీ తరువాయి

చెప్పారు. దురదృష్టవశాత్తూ మన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు తగిన గుర్తింపు తీసుకురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత పాలకులు దృష్టి పెట్టలేదని ఆరోపించారు. అటవీ ప్రాంతాల సందర్శనకు తెలంగాణ వాసులు మధ్య ప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లడం దురదృష్టకరమన్నారు. దైవ దర్శనాలకు తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారని తెలిపారు. ఇటీవల తాను చేపట్టిన విదేశీ పర్యటనలో తెలంగాణకు భారీ పెట్టుబడులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. ఎన్నో అపోహలు, అనుమానాలు సృష్టించారని మండిపడ్డారు. కానీ పెట్టుబడిదారులు తమ విశ్వాసాన్ని చాటుకున్నారని అభినందించారు. పక్కా ప్రణాళికతో వెళ్లడంతోనే 13 నెలల్లోరూ.1.80లక్షకోట్ల పెట్టుబడులొచ్చాయని వెల్లడించారు. సింగపూర్ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామమన్నారు. సినీనటుడు చిరంజీవి మాట్లాడుతూ ఎక్స్ పీరియం పార్క్ ను బ్యూటిఫుల్ పీస్ ఆఫ్ ఆర్ట్‌గా అభివర్ణించారు. భవిష్యత్తులో ఇది అద్భుతమైన ల్యాండ్ మార్క్ అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి వన్నె తీసుకువస్తుందన్నారు. ఎప్పుడో విదేశాలకు వెళ్లినప్పుడు రకరకాల మొక్కలు, అద్భుతమైన జీవం ఉట్టిపడే శిల్పాలు హైదరాబాద్ పరిధిలోని ఈ పార్క్ లో లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. విభిన్నమైన మొక్కలు, అద్భుతమైన కళాఖండాలు ఉన్నాయని తెలిపారు. ఈ పార్కు ఏర్పాటు చేసిన రామ్‌దేవ్ ఒక వ్యాపార వేత్త కాదని, ఒక కళాకారుడని కొనియాడారు. 25 ఏళ్ల పాటు రామ్‌దేవ్ ఇలాంటి వాటిపై ఎన్నో పరిశోధనలు చేశారని, ఎక్కడెక్కడ ఎలాంటి మొక్కలు దొరుకుతాయి. శిలలు దొరుకుతాయి.. వాటికి ఇక్కడికి ఎలా తీసుకొని రావాలి.. వాటిని శోధించారన్నారు. కాగా, మొత్తం 150 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేశారు. అందులో దాదాపు 85 దేశాలకు నుంచి ఇంపోర్ట్ చేసుకున్న అరుదైన వృక్షాలు, మొక్కలు ఉన్నాయి. ఎక్స్పీరియమ్ పార్క్ లో రూ.లక్ష నుంచి రూ.3.5 కోట్ల విలువ చేసే వృక్షాలు ఉండడం విశేషం. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణరావు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

**కలంజ్యోతి, మంచిర్యాల :** విద్యార్థులు ఇష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహంలో 10వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సన్మానించడంతో పాటు జాతీయ స్థాయిలో అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన జైపూర్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహ విద్యార్థిని ఈ.సంజనను సత్కరించారు. కార్యక్రమంలో సహాయ వెనుకబడిన తరగతుల అధికారి డి. భాగ్యవతి, వసతి గృహ సంక్షేమాధికారులు పెండం శ్రీహరి, కొండా ధర్మానంద్ గౌడ్, మంద తిరుపతి, బొడ్డు శ్రీనివాస్, మోహిసిన్ అహ్మద్, నరేష్, ఎం.సరిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రేడియేషన్‌పై అవగాహన సదస్సు

**రేడియేషన్ వల్ల ఎలాంటి హాని తలెత్తదు : డీఓటీ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్**

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండల కేంద్రంలోని కొత్తపేట ప్రాంతంలో ఓ ఇంటిపై జియో సెల్ టవర్ నిర్మాణం వద్దని సోమవారం ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. టవర్ నిర్మాణం చేపడితే రేడియేషన్ వల్ల తమకు ఇబ్బందులు ఉంటాయని వారు పేర్కొన్నారు. దీంతో మంగళవారం డీవోటీ డైరెక్టర్ శ్రవణ్ కుమార్ మల్యాలకు వచ్చి రేడియేషన్ పై స్థానికులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రేడియేషన్ వల్ల ఎలాంటి హాని తలెత్తదని, అదంతా ఓ అపోహ మాత్రమేనన్నారు. అయినప్పటికీ స్థానికులు టవర్ నిర్మాణం వద్దని తేల్చి చెప్పారు. అయితే స్థానికులు ఇటీవల నిరసన కూడా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, జియో సిబ్బంది, స్థానిక నాయకులు జనగాం రాములు, మంద తిరుపతి, శ్రీకాంత్, పలువురు మహిళలు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్




**కలంజ్యోతి, మంచిర్యాల :** విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రతతో చదువుతూ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీఉషోదయ ఉన్నత పాఠశాల మైదానంలో కలాంస్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెన్స్ (కె.ఐ.వై.ఈ.), యార్లగడ్డ అభిరామ్ మెమోరియల్ గ్రామ సేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్స్పైర్ ఇండియా2025 ఒక్క రోజు స్పేస్, డిఫెన్స్ ఎక్స్పో కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ చైర్మన్ సతీష్ రెడ్డి, ఎన్.ఆర్.ఎస్.సి. శివశంకర్ లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడంతో పాటు దేశ రక్షణలో తమ వంతు బాధ్యత నిర్వర్తించేందుకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇస్రో, సాంకేతికత రంగంలో చెందుతున్న అభివృద్ధి, స్పేస్లో మారుతున్న పరిణామాలపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శన ఏర్పాటు చేయడం విద్యార్థుల అదృష్టమని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని విజ్ఞానాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# టెన్త్‌క్లాస్ స్టూడెంట్స్‌కి విజయోస్తు


**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలోని క్రాస్ రోడ్డు వద్ద గల ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ముందస్తుగా విజయోస్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ జయసింహారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటు చేయగా, జిల్లా విద్యాధికారి కే.రాము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ కి విషయ అవగాహన సదస్సు (వివిధ సబ్జెక్ట్స్)పై ఏడుగురు ఉపాధ్యాయ నిపుణులు మెలుకువలను వివరించారు. పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు డిల్లీ డిఫెన్స్ అకాడమీ, కళాశాల, మండల ట్రస్మా సౌజన్యంతో ప్రత్యేకంగా కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ఈసారి ఫలితాల్లో 100కు 100 శాతం మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జయసింహారావు, సెక్టోరియల్ ఆఫీసర్ రాజేష్, డీసీబీ సెక్రెటరీ మురళి మనోహర్ చారి, ఏసీజీ రాజమౌళి, ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రెడ్డి, ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన డాక్టర్ సురేష్ కుమార్ కి హోమియో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రేపు సమర శంఖారావం సభ

## వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన దేగల శ్రీనివాస్

**కలంజ్యోతి, నర్సంపేట :** ఈనెల 30న హాలో బీసీ చలో హైదరాబాద్ బీసీ విద్యార్థుల సమరశంఖారావం సభ వాల్ పోస్టర్లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి చెన్నూరు రవి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బిట్స్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా నాయకులు, నర్సంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ దేగల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరై విద్యార్థుల సమక్షంలో వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేగల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపుమేరకు విద్యార్థుల బిట్స్ కాలేజీలో విద్యార్థుల సమర శంకరావం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెన్నూరు రవి ముదిరాజ్, బీసీ సంఘం నియోజకవర్గ నాయకులు మరుపాల వీరస్వామి, బిట్స్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు ఇమ్మాడి రంజిత్ కుమార్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యాం కుమార్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, పాపయ్యపేట గ్రామ కార్యదర్శి చెన్నూరు స్వామి, పట్టణ యూత్ కార్యదర్శి గోపగాని నాగరాజు, విద్యార్థులు వేనంపల్లి యశ్వంత్ ,బుర్ర అభినయ్, తరుణ్, లిఖిత్ ,అక్షిత, వర్ష పాల్గొన్నారు.





# రామాలయానికి రూ.లక్ష విరాళం

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లపూర్ నియోజకవర్గం శ్రీకృష్ణనగర్ లో నూతన రామలయం గుడి నిర్మాణానికి సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆదివారం శ్రీ కృష్ణానగర్ అధ్యక్షులు దారం శివగుప్తా రూ.లక్ష విరాళం అందజేశారు. దేవుడి కృప లేనిదే మనం లేమన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇవ్వడం తనకు సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తాం తెలిపారు.

# చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడి కొక్కిస రాజు(36) అనే గీతకార్మికుడు మృతి చెందిన సంఘటన భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు రాజు దినచర్యలో భాగంగా కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లుగీస్తుండగా అదుపుతప్పి చెట్టు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకు భార్య స్వప్న, ఒక కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు.

# కాల్ బాయ్ పేరిట యువకుడికి కుచ్చు టోపీ



**కలంజ్యోతి, నిర్మల్ :** కాల్ బాయ్ గా పని చేసే అవకాశం ఉన్నదని చెప్పి యువకునికి రూ.35 వేల మేర కుచ్చు టోపీ వేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా కుంటాల మం డల కేంద్రానికి చెందిన యువకునికి గుర్తు తెలియని నంబర్ నుంచి రెండు రోజుల కిందట కాల్ వచ్చింది. తమ వద్ద కాల్ బాయ్ గా పని చేసే అవకా శం ఉన్నదని సుఖపడవచ్చని ఆశ చూపారు. ఇందుకోసం పేరు నమోదు చేసేందుకు రుసుము చెల్లించాలని నమ్మబలికారు. వారు దాదాపు రూ.35 వేలు విడతల వారీగా దండుకున్నారు. తర్వాత ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావటంతో తాను మోసపోయా నని గ్రహించాడు. చివరికి పోలీసులను ఆశ్రయించాడు.



# బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**కలంజ్యోతి, మల్యాల :** యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం మల్యాలలోని బ్లాక్ చౌరస్తా వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఇందిరాగాంధీ, గద్దర్ పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు శనిగారవు తిరుపతి, దారం ఆదిరెడ్డి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మ్యాక లక్ష్మణ్, నరసింహారెడ్డి, కటుకం వినయ్, నక్క అనిల్, తాళ్ళ హరినాథ్, కిషన్ రెడ్డి, దూడం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నుంచి దృష్టి మరల్చేందుకే ప్రభుత్వ ప్రయత్నం

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

**కలంజ్యోతి, హైదరాబాద్:**



రైతు భరోసా డబ్బులపై ప్రజల దృష్టిని మరల్చేందుకే సీఎం రేవంత్ రెడ్డి పద్మశ్రీ అవార్డుల అంశాన్ని లేవనెత్తి రాద్ధాంతం సృష్టిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ మండిపడ్డారు. మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ప్రసంగించారు. జనవరి 26న రైతు భరోసా ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజలు తిరగబడతారనే విమర్శల పేరుతో వారి దృష్టి మళ్లిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ పార్టీ చేసిన వ్యాఖ్యలకు సమాధానం మాత్రమే చెప్పారన్నారు. పద్మశ్రీ అవార్డులపై నిప్పు రాజేసిందెవరని నిలదీశారు. దళిత బిడ్డల పేర్లు తీసుకొని విమర్శలు చేయడం వెనుక రేవంత్ రెడ్డి ఉద్దేశమేంటని ప్రశ్నించారు. మందకృష్ణకు అవార్డు ఇస్తే ఓర్చుకోలేని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టాలనే గాంధీ కుటుంబ ఎజెండాను అమలు చేస్తున్నట్లు కనిపిస్తుందని విమర్శించారు. ఎంపీ ఎన్నికల్లోనూ అసత్య ప్రచారాలు చేసి దళితులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇప్పటికే రాజ్యాంగానికి, ఎస్సీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మందకృష్ణకు ఇచ్చిన మాట ప్రకారం ప్రధాని మోదీ వర్గీకరణను ప్రారంభిస్తారని రుద్రమ చెప్పారు. ఆరు గ్యారంటీలను ఆటకెక్కించి, పెట్టుబడులను గాలికొదిలేసి, దళిత కార్డు పేరుతో పద్మ అవార్డుల అంశం లేవనెత్తి రాజకీయం చేయాలని, మంత్రి బండి సంజయ్ పై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మందకృష్ణది ఆది నుంచి ఒకటే సిద్ధాంతం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నంది అవార్డులకు గద్దర్ అవార్డులుగా పేరు ఎందుకు పెట్టారు? ఎవరి అభిప్రాయాలను తీసుకున్నారని నిలదీశారు. ఇది ఫెడరల్ స్ఫూర్తి మీకు మాత్రం ఉండొద్దా? అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ ను ఇక తెలంగాణ ప్రజలు ఎన్నటికీ నమ్మబోరన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీజేపీ హస్తం వెంట పడుతూనే ఉంటుందని రాణి రుద్రమ స్పష్టం చేశారు.

# పునరావాసులకు వసతులు కల్పించండి

### కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :**



నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో పునరావాసితులైన మైసంపేట్, రాంపూర్ గ్రామాల ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. పునరావాస గ్రామాల ప్రజలకు కల్పిస్తున్న వసతులపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పునరావాసం పొందిన ప్రజలకు కేటాయించిన వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా మార్చాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన సమాచారాన్ని శాఖల వారీగా సమీక్షించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గ్రామస్తులకు కల్పిస్తున్న అన్ని మౌలిక వసతులను అత్యంత నాణ్యంగా చేపట్టాలన్నారు. గ్రామస్తుల పంట భూములకు సంబంధించి రెవెన్యూ పట్టాల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మిగిలిన పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవో రత్న కళ్యాణి, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది చిల్లర రాజకీయాలు మానుకో

### పీసీసీ సభ్యులు పెండం రామానంద్



**కలంజ్యోతి, నర్సంపేట :** పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో పేద ప్రజలకు ఎన్ని ఇండ్లు కట్టించావు చెప్పాలని ఇకనైనా బుద్ధి తెచ్చుకుని చిల్లర రాజకీయలు మానుకో అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ సభ్యులు పెండం రామానంద్ సూచించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క నిరుపేద కుటుంబానికి రూ.5లక్షలతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని మాయమాటలతో గద్దెనెక్కి పదేళ్ల పాలనలో నర్సంపేట నియోజకవర్గంలో ఎన్ని ఇండ్లు కట్టించావు చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గతంలో మేము ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో ఇండ్ల నిర్మాణాలకు పట్టాలు అందించి ఇండ్లులేని పేద ప్రజలకు ఇండ్లు కట్టిస్తున్నామన్నారు. గతంలో నువ్వు ఇచ్చిన హామీలు ఎంతవరకు నెరవేర్చావో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యే దొంతిపై అవాకులు చేవాకులు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.



# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

### నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

### పరీక్షల నిర్వహణకు హై పవర్ కమిటీ ఏర్పాటు

**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో నేటి నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సమర్థవంతంగా పరీక్షలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తో కలిసి జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం హైపవర్ కమిటీని నియమించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. సమీక్షలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, బీ.ఎస్.ఎన్.ఎల్. జె.టి.ఓ. కె.రాజేష్, విద్యుత్ శాఖ అధికారి ఎన్.సాయికృష్ణ, సాంఘిక సంక్షేమశాఖ డి.సి.ఓ. కోల నాగేశ్వరావు పాల్గొన్నారు.

# ప్రజారక్షణే లక్ష్యం

### గూడూరు సీఐ సూర్యప్రకాశ్

**కలంజ్యోతి, గూడురు :** ప్రజారక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని గూడూరు సీఐ సూర్యప్రకాష్ అన్నారు.మంగళవారం కొత్తగూడ మండల కేంద్రంలోని వివిధ గ్రామాలల్లో మంత్రి సీతక్క చోరువతో నిరుపేదల కుటుంబాలకు గూడూరు సీఐ సూర్య ప్రకాష్,ఎస్సై కుశ కుమార్ లు దుప్పట్లను ఉచితంగా పంపిణి చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగ గూడూరు సీఐ సూర్యప్రకాష్మాట్లాడుతూ...చలికాలంలో ఆరోగ్య సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి ముందస్తుగా చలిలో ఎక్కువగా తిరగకుండా నూలు వస్త్రాలు ధరిస్తూ వేడి నీళ్ళను తాగుతూ స్నానానికి కూడా వేడి నీళ్ళతో చేస్తూ జలుబు, దగ్గు, ఆస్తమా వంటి సమస్యలు తలెత్తితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ నాయకులు వజ్జ సారయ్య, చల్ల నారాయణ రెడ్డి, రూప్ సింగ్, మొగిలి, రాజేశ్వర్, లావణ్య వెంకన్న,ప్రశాంత్, కానిస్టేబుల్ లు భరత్, ప్రశాంత్, కిషోర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



Cinema కలంజ్యోతి
బుధవారం 29.01.2025

# అందుకు ఓకే చెప్పేసిందట!



కోలీవుడ్ బ్యూటీ ఆండ్రియా జర్మియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సింగర్‌గా పరిచయం అయి మంచి గుర్తింపు తెచ్చుకుంది. 'యుగానికి ఒక్కడు' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఆమె ఫుల్ పాపులారిటీ సంపాదించుకుంది. దీంతో వరుస అవకాశాలు రావడంతో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. ప్రస్తుతం తమిళంలో మిస్కిన్ దర్శకత్వంలో 'పిసాసు--2'లో చేసింది. అయితే ఈ మూవీ 'పిసాసు' సీక్వెల్‌గా రాబోతుంది. అయితే మొదటి పార్ట్ బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో సీక్వెల్‌ను ప్లాన్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఇప్పటికే పూర్తి అయినప్పటికీ విడుదల కాలేదు. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తుంది. 'పిసాసు--2' షూటింగ్ 2022లోనే స్టార్ట్ అయినప్పటికీ మూడేళ్లు పూర్తి కావస్తున్నా థియేటర్స్‌లోకి రాలేదు. అయితే ఈ చిత్రం మార్చిలో విడుదల కాబోతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ మిస్కిన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'పిసాసు--2 కథ విన్నాక కొన్ని సీన్స్ నగ్నంగా నటించేందుకు ఆండ్రియా అంగీకరించింది. కథకు అవసరం అని ఆమె ఆ రిస్క్ చేయడానికి కూడా రెడీ అయింది. దీనికి సంబంధించిన ఒక ఫొటో షూట్ కూడా చేయాలని ఆమె సిద్ధపడింది. కానీ నగ్నంగా సీన్స్ చేస్తే యువత మరో కోణంలో చూస్తారేమో అనిపించింది. అందుకే ఆండ్రియాను అలా చూపించే విషయంలో వెనకడుగు వేశాను. కానీ ఇప్పుడు అనిపిస్తుంది. ఆండ్రియాతో నిజంగా నగ్న సన్నివేశాలు తీస్తే సినిమా ఇప్పటికే రిలీజ్ అయ్యేది. మంచి బిజినెస్ జరిగేది కావచ్చు' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మిస్కిన్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.